సాక్షి వనపర్తి

శనివారం ı 19 ı అక్టోబర్ ı 2024

ప్రభుత్వాన్ని బద్నాం చేసే ప్రయత్నం



- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన
- బీసీ కులగణనకు సహకరించండి
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

– గద్వాల అర్బన్

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
33.0 /22.9

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. రాత్రి వేళ చలి తీవ్రత కాస్త ఉంటుంది.

న్యూస్‌రీల్

21న ఐటీఐ అప్రెంటీస్‌షిప్ మేళా

వనపర్తిటౌన్: జిల్లాకేంద్రంలోని **ప్రభుత్వ** ఐటీఐ కళాశాలలో ఈ నెల 21న **ప్రధానమంత్రి** జాతీయ అప్రెంటీస్‌షిప్ మేళా **నిర్వహిస్తు**న్నట్లు ప్రిన్సిపల్ రమేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని.. అప్రెంటీస్‌షిప్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. అన్ని ధ్రువీకరణ పత్రాలను వెంట తెచ్చుకోవాలని.. పూర్తి వివరాలకు సెల్‌ఫోన్ నంబర్ 98492 44030 సంప్రదించాలని సూచించారు.

కేంద్ర బృందం సందర్శన



అమరచింత: కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి వినియోగిస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం సద్వినియోగం చేసిందా లేదా అనే వివరాలు తెలుసుకునేందుకు మండలంలోని ఈర్లదిన్నెలో శుక్రవారం కేంద్ర బృందం పర్యటించింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ సభ్యులు దేశ్‌పాండే, ప్రవీణ్ పాటిల్ గ్రామంలోని అన్ని వార్డుల్లో తిరిగి గ్రామీణ జాతీయ ఉపాధిహామీ పథకం, సడక్ యోజన, ఉపాధి కల్పన, దీన్‌దయాళ్ రోజ్‌గార్ యోజన, కిసాన్ సమ్మాన్‌నిధితో పాటు వివిధ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారితో మాట్లాడారు. చిరు వ్యాపారాలతో ఎంత మేర లాభం వస్తుందని అడిగి తెలుసుకున్నారు. ఆసరా పింఛన్‌దారులతో సమావేశమై ప్రతినెల పింఛన్ వస్తుందా లేదా ఆరా తీశారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. పూర్తి నివేదికను సంబంధిత కేంద్ర మంత్రిత్వశాఖకు అందిస్తామని చెప్పారు. వారి వెంట డీఆర్డీఓ ఉమాదేవి, అడిషనల్ డీఆర్డీఓ నరేందర్, ఏపీడీ సుల్తాన్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీఎం శ్రీనివాసులు, సాంకేతిక సహాయకుడు మల్లికార్జున్, ఎంపీఓ నరసింహులు, పీఆర్ ఏఈ నరేష్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

నేడు చెరుకు రైతుల సమావేశం



అమరచింత: చెరుకు రైతుల సమస్యల పరిష్కారానికి కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యంతో రాజీలేని పోరాటం చేస్తున్నామని కృష్ణవేణి చెరుకు రైతుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల చెరుకు రైతులతో సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చించారు. శనివారం కొత్తకోటలో ఉమ్మడి జిల్లా చెరుకు రైతుల సమావేశం నిర్వహిస్తున్నామని.. ఫ్యాక్టరీ యాజమాన్యానికి సమస్యలను విన్నవించేందుకు చెరుకు రైతులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు. రికవరీతో సంబంధం లేకుండా టన్ను చెరుకుకు కటింగ్, రవాణా పోను రూ.3,500 చెల్లించాలన్నారు. టన్ను చెరుకు కోతకు కూలి రూ.560గా నిర్ణయించాలన్నారు. వేరు పురుగును పూర్తిగా నివారించి రైతులు నష్టాల బారిన పడకుండా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. విత్తన బిల్లులు 45 రోజుల్లో చెల్లించాల్సి ఉండగా.. ఆలస్యమైనందుకు రైతులకు 16 శాతం వడ్డీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. చెరుకు విక్రయించిన 15 రోజుల్లో డబ్బులు చెల్లించాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు వాసారెడ్డి, అరుణ్‌కుమార్, రంగారెడ్డి, చంద్రసేనారెడ్డి, మహేంద్రాచారి, శ్రీనివాసులు, మన్యంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

47 మందికి ఏఎస్‌ఐలుగా పదోన్నతులు

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 47 మంది హెడ్‌కానిస్టేబుల్స్‌కు ఏఎస్‌ఐలుగా పదోన్నతులు కల్పించారు. వీరందరికీ ఈ నెల 22నుంచి జనవరి 13 వరకు హైదరాబాద్‌లోని ఆర్‌బీవీఆర్ఆర్, టీజీపీఏ కేంద్రంలో శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణకు వెళ్తున్న ఏఎస్‌ఐలకు అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు పూర్తి చేసుకున్న తర్వాతే రిపోర్టు చేయాల్సి ఉంది.


హంస ధాన్యం క్వింటా రూ.1,901

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో శుక్రవారం జరిగిన టెండర్లలో హంస ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.1,901గా ఒకే ధర లభించింది. సీజన్ ఇంకా ప్రారంభం కాకపోవడంతో మార్కెట్‌కు కేవలం వంద బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

కలిసొచ్చిన దసరా..

వనపర్తి ఆర్టీసీకి రూ.3.91 కోట్ల ఆదాయం

- రాకపోకలు సాగించిన 7.28 లక్షల మంది ప్రయాణికులు
- ఓఆర్‌లో రాష్ట్రంలోనే మొదటి స్థానం
- సిబ్బంది సహకారంతోనే..



వనపర్తి టౌన్: దసరా వనపర్తి ఆర్టీసీకి కలిసొచ్చింది. పండుగకు వారం ముందు.. తర్వాత నాలుగు రోజుల పాటు డిపోకు భారీగా ఆదాయం సమకూరింది. రోజు వచ్చే రూ.26 లక్షలకు అదనంగా రోజురోజుకు రూ.లక్ష, రూ.2 లక్షల చొప్పున పెరుగుతూ ఏకంగా రూ.18 లక్షల వరకు చేరింది. 11 రోజుల్లో 7.28 లక్షల మంది ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చేందుకు 4.45 లక్షల కిలోమీటర్లు బస్సులను తిప్పి రూ.3.91 కోట్ల ఆదాయం సాధించారు. పండుగ ముందు రోజుల్లో అదనంగా 10 బస్సులు కేటాయించి రోజుకు 15 ట్రిప్పులు నడపడంతో వారం రోజుల్లో 2.99 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. ఇందులో మహిళలు 1.88 లక్షలు ఉండగా.. పురుషులు 1.11 లక్షలు ఉన్నారు. వారం రోజుల్లో రూ.2.26 కోట్ల ఆదాయం సమకూరింది.

సిబ్బంది సహకారంతోనే..



డిపోకు దసరా తర్వాత అత్యధికంగా అదనపు ఆదాయం వచ్చింది. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా అదనపు ట్రిప్పులను నడపడంతో పాటు డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది సహకారంతోనే అధిక ఆదాయం సమకూరింది. పండుగ ముందు మొస్తరుగా ఉన్నా.. పండుగ తర్వాత గణనీయంగా పెరిగింది.

– వేణుగోపాల్, డిపో మేనేజర్, వనపర్తి

నాలుగు రోజుల్లో ఇలా..

ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు రూ.1,61,36,000 అదనపు ఆదాయం సమకూరింది. నాలుగు రోజుల్లో 4.34 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. ఇందులో మహిళలు 2.86 లక్షలు, పురుషులు 1.48 లక్షలు ఉండగా.. వీరిని గమ్యస్థానాలకు చేర్చేందుకు 1.45 లక్షల కిలోమీటర్లు బస్సులు తిరిగాయి. హైదరాబాద్‌కు రోజు నడిపే 67 ట్రిప్పులకు అదనంగా 15 బస్సులను కేటాయించి 27 ట్రిప్పులు నడిపారు. కిలోమీటర్‌కు రోజువారి కంటే రూ.25 అదనపు ఆదాయం కలుపుకొని రూ.85 వచ్చింది. ప్రత్యేక బస్సుల్లో పెంచిన ఛార్జీలు కూడా ఆర్టీసీకి అదనపు ఆదాయం సమకూరేందుకు కలిసొచ్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు. 14వ తేదీన రోజువారీ కంటే అదనంగా రూ.18 లక్షలు వచ్చింది.

తేదీల వారీగా వచ్చిన ఆదాయం

తేదీ	ఆదాయం (రూ.లలో..)
5	30,90,453
6	29,11,541
7	29,85,636
8	27,09,403
9	27,48,040
10	28,21,765
11	29,93,809
14	44,35,000
15	42,74,000
16	39,53,000
17	34,73,000

హైదరాబాద్ మార్గంలోనే అధిక ఆదాయం..

దసరాకు ఊహించని రీతిలో అదనపు ఆదాయం సమకూరేందుకు హైదరాబాద్ రూటే కారణమని అధికారులు ధ్రువీకరిస్తున్నారు. రోజు డిపో పరిధిలో 40 వేల కిలోమీటర్లు తిరిగే బస్సులు హైదరాబాద్ రూట్‌లో 3 నుంచి 8 వేల వరకు అధికంగా తిరిగారు. ఎప్పుడూ లేనంతగా హైదరాబాద్‌కు ప్రయాణికుల రద్దీ పెరగడంతో అందుకు అనుగుణంగా బస్సులను నడిపారు. సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులను బిజినేపల్లి, కొత్తకోట మార్గంలో నడపడంతో ఆర్టీసీకి అదనంగా ఆదాయం సమకూరింది. రెగ్యులర్‌గా నడిచే కర్నూలు, మహబూబ్‌నగర్ తదితర 20కి పైగా రూట్లలో రోజు వారి కంటే రూ.10 వేలు, రూ.20 వేలకు మించి ఆదాయం రాలేదు. ఒక్క హైదరాబాద్ రూట్‌లోనే రోజు రూ.లక్ష నుంచి రూ.18 లక్షల వరకు అదనపు ఆదాయం సమకూరింది. ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) 146కు చేరి రాష్ట్రంలోనే వనపర్తి డిపో మొదటి స్థానంలో నిలిచింది.



బస్సుల కోసం వనపర్తి డిపోలో వేచిచూస్తున్న ప్రయాణికులు (ఫైల్)

సమష్టి కృషితో మెరుగైన ఆదాయం : ఆర్‌ఎం

స్టేషన్ మహబూబ్‌నగర్: డ్రైవర్లు, కండక్టర్లతో పాటు ఇతర ఉద్యోగుల సమష్టి కృషితో దసరా పండగ రోజుల్లో రీజియన్‌కు మెరుగైన ఆదాయం వచ్చిందని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి తెలిపారు. శుక్రవారం ఆమె రీజినల్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా ప్ర యాణికుల సౌకర్యార్థం అదనపు బస్సులు నడిపామని తెలిపారు. ముఖ్యమైన కేంద్రాల్లో ఆయా విభాగాల ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించి ప్రయాణికులు గమ్యస్థానాల్లో చేర్చేలా చూశామని తెలిపారు. ప్రజలు ఆర్టీసీని ఆదరించడం వల్ల మంచి ఆదాయాన్ని సాధించి నట్లు చెప్పారు. శబరిమలై కోసం రీజియన్‌లోని అన్ని డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతామని, అయ్య ప్పస్వాములు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే పెళ్లిళ్లు, శుభకార్యాలకు ఎలాంటి డిపాజిట్ లేకుండా ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకోవచ్చని తెలిపారు. దసరా పండుగను పురస్కరించుకొని ప్రత్యేక బస్సులకు 25 శాతం అదనపు చార్జీలు వసూలు చేసినట్లు చెప్పారు. హైదరాబాద్‌కు వెళ్లే ప్రత్యేక బస్సులకే మాత్రమే చార్జీలు పెంచామన్నారు. పండగ వేళల్లో వన్ వే ట్రాఫిక్ ఉంటుందని, రెండో వేలో ఉండదని, అందువల్లే కొంచెం నామమాత్రపు చార్జీలు పెంచి తీసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు లక్ష్మి ధర్మ, శ్యామల, డిపో మేనేజర్ సుజాత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రీజినల్ మేనేజర్ శ్రీదేవి

న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలి

వనపర్తిటౌన్: ప్రజలందరికి న్యాయ సేవలను చేరువ చేసేందుకు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ టోల్‌ఫ్రీ నంబర్ 15100 అందుబాటులోకి తీసుకొచ్చిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత తెలిపారు. శుక్రవారం న్యాయ విజ్ఞాన సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో టోల్‌ఫ్రీ నంబర్, వెబ్‌సైట్ వాల్‌పోస్టర్లను జిల్లా కోర్టులో ఆమె విడుదల చేసి మాట్లాడారు. ఆన్‌లైన్‌లో న్యాయసేవలకు దరఖాస్తు చేసుకుంటే జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఉచితంగా న్యాయవాదిని సమకూర్చుతుందన్నారు. న్యాయం పేదలకు వేగంగా అందించేందుకు వెబ్‌సైట్, సలహాలు, సూచనలు ఇచ్చేందుకు టోల్‌ఫ్రీ నంబర్‌ను వినియోగించుకోవాలని సూచించారు. న్యాయమూర్తి రజని, చీఫ్ డిఫెన్స్ లీగల్ కౌన్సిల్ బాలనాగయ్య, ప్యానల్ న్యాయవాదులు మోహన్‌కుమార్, వెంకటరమణ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత తదితరులు

న్యాయ విజ్ఞాన సదస్సు..

విద్యార్థులు చదువుకు ప్రాధాన్యమిస్తే జీవితంలో ఉన్నతంగా స్థిరపడేందుకు అవకాశం ఉంటుందని అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రతినిధులు ఎం.శ్రీదేవి, ఉత్తరయ్య అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని చేయూత ఆశ్రమంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో వారు మాట్లాడారు. బాలలు విద్యాహక్కు చట్టం ప్రకారం చదువుకోవాలని సూచించారు.

'భరోసా'తో మహిళలకు భద్రత

ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి: ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న భరోసా కేంద్రాలు పోక్సో, అత్యాచార బాధితులకు అండగా నిలుస్తాయని ఎస్పీ రావుల గిరిధర్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అత్యాచార బాధితులకు వైద్య, న్యాయ, మానసిక సేవలను ఒకే గొడుగు కిందకు తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు. సిబ్బంది బాధితుల ఇళ్లను సందర్శించి వారి సాంఘిక, ఆర్థిక పరిస్థితులను అధ్యయనం చేస్తారని.. ఆ కుటుంబాలకు భరోసా బాధిత సహాయనిధి నుంచి రూ. పది వేల వరకు తక్షణ పరిహారం అందజేస్తారని చెప్పారు. ఈ కేంద్రాలు మహిళలకు భద్రతతో పాటు ఆర్థికంగా చేదోడుగా నిలుస్తాయని వివరించారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కొత్తకోట రూరల్/మదనాపురం: మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కొత్తకోట మండలం కానాయపల్లి శివారులో ఉన్న శంకరసముద్రం, మదనాపురం మండలం సరళాసాగర్ జలాశయంలో ముదిరాజ్ కులస్తులు, గ్రామస్తులతో కలిసి చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం పండుగ వాతావరణంలో నిర్వహిస్తోందన్నారు. గత పాలకులు ప్రచార ఆర్భాటాలు తప్పా మత్స్యకారులను ఆదుకున్నది ఏమీ లేదని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక కార్యాచరణతో చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తూ మత్స్యకారుల సంక్షేమానికి పాటుపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం పూర్తి సబ్సిడీతో చేప పిల్లలను పంపిణీ చేస్తోందని.. మత్స్యకారులు పెరిగిన చేపలను విక్రయించి ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. కానాయపల్లిలో జరిగిన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సీడీసీ చైర్మన్ గొల్లబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ రావుల సురేంద్రనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు డా. పీజే బాబు, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, రంగస్వామి, బీచుపల్లియాదవ్, గోకరయ్య, నాగరాజు, బాలరాజు, శ్రీనివాసులు, సరళసాగర్‌లో జరిగిన కార్యక్రమంలో మదనాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె ప్రశాంత్, వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, వడ్డె కృష్ణ, జగదీశ్, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, తహసీల్దార్ అబ్రహం లింకన్, పార్టీ మండల అధ్యక్షుడు నాగన్న, నాయకులు టీసీ నాగన్నయాదవ్, వెంకటనారాయణ, హనుమాన్‌రావు అక్కల మహదేవన్‌గౌడ్, సాయిబాబా, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సరళాసాగర్‌లో చేపపిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

➩ నర్సింగాపురంలో ఉపాధి పనులు చేస్తూ మృతి చెందిన చెన్నన్న కుటుంబానికి శుక్రవారం ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.రెండు లక్షల ప్రొసీడింగ్‌ను ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అందజేశారు.

'ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం'

వనపర్తి రూరల్: జిల్లాకేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం తెలంగాణ రైతు సంఘం (ఏఐకేఎస్) జిల్లా అధ్యక్షుడు డి.బాల్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. 2020 లాక్‌డౌన్ సమయంలో కేంద్ర కార్మిక సంఘాలు సార్వత్రిక సమ్మె, అదే ఏడాది కర్షకలోకం చారిత్రాత్మక రైతు పోరాటం సాగించాయని తెలిపారు. ఈ రెండు పోరాటాల నాలుగో వార్షికోత్సవం పురస్కరించుకొని వచ్చే నెల 26న దేశవ్యాప్తంగా భారీ జన సమీకరణతో ప్రదర్శనలు చేపట్టాలని రైతు, కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పరమేశ్వరాచారి, కోశాధికారి వెంకటేశ్, మహబూబ్‌బాషా, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



పీయూ వీసీగా జీఎన్ శ్రీనివాస్

- **నియామక** ఉత్తర్వులు జారీ చేసిన **ప్రభుత్వం**
- **నేడు బాధ్యత**లు స్వీకరించే అవకాశం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా జీఎన్ శ్రీనివాస్‌ను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. మే నెలలో వైస్ చాన్స్‌లర్ లక్ష్మీకాంత్ రాథోడ్ పదవీకాలం ముగిసిన తర్వాత ఐఏఎస్ అధికారి అహ్మద్ నదీమ్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం తాజాగా శ్రీనివాస్‌ను రెగ్యులర్ వీసీగా నియమించింది. ఈ క్రమంలో ప్రభుత్వానికి సెర్చ్ కమిటీ ముగ్గురు పేర్లను సిఫార్సు చేయగా అందులో బీసీ రిజర్వేషన్‌లో ఆయనకు అవకాశం దక్కినట్లు తెలుస్తుంది. శ్రీనివాస్ ప్రస్తుతం హైదరాబాద్ జేఎన్టీయూలో ఎల్రక్టికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈయన ఉమ్మడి కరీంనగర్ జిల్లా సిరిసిల్ల కొత్తపల్లి గ్రామానికి చెందినవారు. పాఠశాల, ఇంటర్ విద్య మొత్తం అక్కడే సాగింది. అనంతరం ఉన్నత విద్య బీటెక్ జేఎన్టీయూ హైదరాబాద్, ఎంఈ ఉస్మానియా యూనివర్సిటీ, పీహెచ్‌డీ జేఎన్టీయూ హైదరాబాద్ నుంచి అందుకున్నారు.



జీఎన్ శ్రీనివాస్

1995లో అధ్యాపకుడిగా ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో ఉస్మానియా యూనివర్సిటీలో చేరారు. అనంతరం 1997– 2003 వరకు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నాలజీ ఉస్మానియా యూనివర్సిటీలో పనిచేశారు. 2003 నుంచి 2006 వరకు అసోసియేట్ ప్రొఫెసర్‌గా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ జేఎన్టీయూ అనంతపురంలో పనిచేశారు. 2006 నుంచి 2010 వరకు జేఎన్టీయూలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2011 నుంచి 2020 వరకు ప్రొఫెసర్‌గా జేఎన్టీయూ హైదరాబాద్‌లో విధులు నిర్వహించారు. ప్రస్తుతం అక్కడే సీనియర్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయన తాజాగా పీయూ వీసీగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శనివారం పీయూలో బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. ఆయన నియామకంపై పీయూ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, కాంట్రాక్టు అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

సుదీర్ఘ అనుభవం..

శ్రీనివాస్‌కు అకాడమిక్‌తో పాటు అడ్మినిస్ట్రేషన్ విభాగంలో సుదీర్ఘ అనుభవం ఉన్నట్లు తెలుస్తుంది. ప్రధానంగా జేఎన్టీయూలో యూజీసీ మాలవీయ మిషన్ టీచర్ ట్రెనింగ్ సెంటర్‌కు డైరెక్టర్‌గా కొనసాగారు. ఈయన ప్రొఫెసర్‌గా పనిచేసిన కాలంలో ఏకంగా 14 మంది ఈ గైడెన్స్‌లో పీహెచ్‌డీలు సాధించారు. అలాగే 77 ఎంటెక్, 28 బీటెక్ ప్రాజెక్టులకు గైడ్‌గా వ్యవహరించారు. అంతేకాకుండా 2023లో 'త్రీఫేజ్ ఫాల్ట్ అనాలసిస్ విత్ ఆటో రీసెట్ ఆన్ టెంపరరీ ఫాల్ట్ అండ్ పర్మనెంట్ ట్రిప్' అనే అంశంపై ప్రభుత్వం నుంచి పేటెంట్ పొందారు. కళాశాల విద్యార్థుల సౌలభ్యం కోసం 'ఎలక్ట్రికల్ మెజర్‌మెంట్స్ అన్ మెష్యూరింగ్ ఇన్‌స్టుమెంట్' పేరుతో ప్రత్యేక టెక్స్ బుక్‌ను కూడా రచించారు.

తెలుగు విశ్వవిద్యాలయం వీసీగా మంగనూర్ వాసి

- వెలుదండ నిత్యానందరావు నియామకంపై గ్రామస్తుల హర్షం



నిత్యానందరావు

బిజినేపల్లి: మండలంలోని మంగనూర్‌లో తెలుగు భాషా కుటుంబంగా పేరు గడించిన విశ్రాంత ఉస్మానియా సీనియర్ ప్రొఫెసర్ వెలుదండ నిత్యానందరావును తెలుగు విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్‌గా నియమిస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 1962 ఆగస్టు 9న రామేశ్వర్‌రావు, లక్ష్మమ్మ దంపతుల రెండో సంతానంగా జన్మించిన నిత్యానందరావు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నారు. తర్వాత పాలెం ఓరియంటల్ కళాశాలలో ప్రముఖ పండితులు కపిలవాయి లింగమూర్తి, రంగాచార్యుల వద్ద శిష్యరికంలో డిగ్రీ పట్టభద్రుడు అయ్యారు. ఈయన 1985లో ప్రథమ శ్రేణిలో ఎంఏ తెలుగు పూర్తి చేశారు. 1988లో ఎంఫిల్, 1990లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. 1992లో ఉస్మానియా తెలుగు శాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరి.. వివాదరహితుడిగా, సౌమ్యుడిగా, నిత్య పరిశోధకుడిగా, రచయితగా పేరు గడించారు. అంచెలంచెలుగా ఎదిగి.. ఉస్మానియా తెలుగు శాఖ అధ్యక్షుడిగా, పాఠ్య ప్రణాళిక సంఘం అధ్యక్షుడిగా కొనసాగారు. 2022 ఆగస్టులో ఉస్మానియా సీనియర్ ప్రొఫెసర్‌గా పదవీ విరమణ పొందారు. వెలుదండ నిత్యానందరావును తెలుగు విశ్వవిద్యాలయం వీసీగా నియమించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రతిభను వెలికితీసేందుకే సీఎం కప్



కాగడతో ర్యాలీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకే సీఎం కప్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ వెల్లడించారు. నవంబర్‌లో పోటీలు ప్రారంభం కానుండగా.. సీఎం కప్ టోర్నీ టార్చ్ ర్యాలీ శుక్రవారం జిల్లాకు చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లాకేంద్రంలో అదనపు కలెక్టర్ కాగడా పట్టుకొని ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. మండల, జిల్లాస్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులను హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వివరించారు. డీఎస్పీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత, క్రీడా స్ఫూర్తి అలవడుతాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీవైఎస్‌ఓ సుధీర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ రతన్‌కుమార్, మధు, పీఈటీ సురేందర్ పాల్గొన్నారు.

గ్రూప్–3 నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు..

జిల్లాలో గ్రూప్–3 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ వెల్లడించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఎం.మహేందర్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. నవంబర్ 17, 18 తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం జరిగే పరీక్షలను జిల్లావ్యాప్తంగా 31 పరీక్ష కేంద్రాల్లో 8,664 మంది అభ్యర్థులు రాయనున్నట్లు వివరించారు.

ప్రణాళికతో ధాన్యం కొనుగోలు..

వరి ధాన్యం కొనుగోలు ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎం.నగేష్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా 297 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యంగా పని చేయాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో వరి గ్రేడ్–ఏ రకం ధాన్యం క్వింటాకు రూ.2,320, సాధారణ రకం ధాన్యానికి రూ.2,300 మద్దతు ధర చెల్లించనున్నట్లు వెల్లడించారు. ధాన్యం తూకం చేసే, తేమ కొలిచే యంత్రాలు, గన్నీబ్యాగులు, టార్పాలిన్లు, తాగునీరు సమకూర్చుకోవాలన్నారు. సేకరించిన ధాన్యం ఏ మిల్లుకు తరలించాలనే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. సన్నరకం ధాన్యం కొనుగోలుకు కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని.. ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తున్నందున రైతులకు నష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. సన్నరకం ధాన్యం గన్నీ బ్యాగులను ప్రత్యేకంగా లోడ్ చేయాలని చెప్పారు. ప్రతి సంచిపై నంబర్ తప్పనిసరిగా ఉండాలన్నారు. సమావేశంలో అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆధునిక వృత్తివిద్య కోర్సులు..

ప్రభుత్వ ఐ.టి.ఐ కళాశాలల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించేందుకు ప్రణాళిక చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ చెప్పారు. శుక్రవారం రాష్ట్ర లేబర్, ఎంప్లాయ్‌మెంట్ ట్రెనింగ్ అండ్ ఫ్యాక్టరీ ముఖ్య కార్యదర్శి సంజయ్‌కుమార్ అన్ని జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. జిల్లా నుంచి అదనపు కలెక్టర్ పాల్గొని వివరాలు వెల్లడించారు. ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ (40 సీట్లు), మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ (24 సీట్లు), బేసిక్ డిజైనర్, వర్చువల్ వెరిఫైయర్ మెకానికల్ (24 సీట్లు) ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్ (20 సీట్లు), అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషన్ టెక్నీషియన్ (24 సీట్లు), ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ టెక్నీషియన్(40 సీట్లు) ఉన్నట్లు వివరించారు.

క్లుప్తంగా

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

చిన్నంబావి: మండలంలోని అమ్మాయిపల్లికి చెందిన ఎరుకలి బాలచందర్ (20) ఉరేసుకొని మృతిచెందాడు. గ్రామస్తుల కథనం మేరకు.. బాలచందర్ మూడురోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు, బంధువులు ఎక్కడ వెదికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం వీపనగండ్ల సమీపంలో అతడి బైక్ కనిపించింది. ముళ్ల పొదల నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు లోనికి వెళ్లి చూడగా ఓ యువకుడి మృతదేహం చెట్టుకు వేలాడుతూ కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం బాలచందర్‌దిగా గుర్తించిన పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



శైలేష్ (ఫైల్)

పెద్దకొత్తపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని వెన్నచర్లలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సతీష్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన సంపంగి హన్మంతు చిన్న కుమారుడు సంపంగి శైలేష్ (18), అదే గ్రామానికి చెందిన తెలుగు సాయికుమార్ కలిసి బైక్‌పై బండరాయిపాకుల వైపు వెళ్తున్నారు. ముందువెళ్తున్న బస్సు దాటుతుండగా బంపర్ తగిలి కిందపడటంతో ఇరువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో శైలేష్ మృతిచెందాడు. సాయికుమార్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శైలేష్ తండ్రి హన్మంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మక్తల్: మండలంలోని టేకులపల్లికి చెందిన నర్సింహులు (32) శుక్రవారం మృతిచెందాడు. స్థానికుల వివరాల మేరకు.. గురువారం సాయంత్రం నర్సింహులు బైక్‌పై మక్తల్‌కు వెళ్లి వస్తుండగా.. మహబూబ్‌నగర్ నుంచి రాయచూర్ వెళ్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య అని, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పిడుగు పడి మహిళా కూలీ..

- మరో ఇద్దరికి తీవ్రగాయాలు



బోయ సంగమ్మ (ఫైల్)

మరికల్: పొలంలో పత్తి తీస్తుండగా అకస్మాతుగా భారీ వర్షం రావడంతో చెట్టు కిందకు వెళ్లిన కూలీలపై పిడుగు పడటంతో ఓ మహిళ అక్కడికక్కడే మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం మండలంలోని కన్మనూర్‌లో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం అనుపూర్‌కు చెందిన కొందరు కూలీలు ఆటోలో మరికల్ మండలం కన్మనూర్‌కు చెందిన ఓ రైతు పొలంలో పత్తి తీయడానికి వచ్చారు. ఈ క్రమంలో మధ్యాహ్నం సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో పక్కనే ఉన్న చెట్టు కిందకు వెళ్లారు. అయితే కూలీలు ఉన్న చెట్టుపై పిడుగు పడటంతో అనుపూర్‌కు చెందిన మహిళా కూలీ బోయ సంగమ్మ(46) అక్కడికక్కడే మృతిచెందగా.. పక్కనే ఉన్న మరో ఇద్దరు కూలీలు మల్లమ్మ, అల్లమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనతో భయబ్రాంతులకు గురైన కూలీల రోదనలు మిన్నంటాయి. వెంటనే వచ్చిన వాహనంలోనే మృతురాలితోపాటు క్షతగ్రాతులను అనుపూర్‌కు తీసుకెళ్లారు.

ప్రభుత్వాన్ని బద్నాం చేసే ప్రయత్నం



జోగుళాంబ అమ్మవారి ఆలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్, కుటుంబ సభ్యులు

- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన
- బీసీ కులగణనకు అందరూ సహకరించండి
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

గద్వాల అర్బన్: గత పాలకులు మిగులు బడ్జెట్‌తో ఉన్నా రాష్ట్రాన్ని అప్పులమయంగా చేయడంతో పాటుగా రూ.40 వేల కోట్ల చెల్లించాల్సిన పరిస్థితిలో ప్రభుత్వాన్ని అప్పజెప్పారని, దీనిని అర్థం చేసుకోకుండా మళ్లీ వాళ్లే ఎగదోసి ట్వీట్లు పెట్టి ప్రభుత్వాన్ని బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నారని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని క్రిష్ణవేణి చౌరస్తాలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ, జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా నీలి శ్రీనివాసులు పదవి బాధ్యతల స్వీకరణకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన పది నెలలుగా ప్రజాపాలనతో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, నియంతృత్వానికి వ్యతిరేకంగా పని చేస్తోందన్నారు. ఉమ్మడి జిల్లా బిడ్డ సీఎం రేవంత్‌రెడ్డి జూరాల, నెట్టెంపాడు, తుమ్మిళ్ల, భీమా వంటి ప్రాజెక్టులతో ఈ ప్రాంతం రైతాంగానికి న్యాయం చేస్తూ ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లో అమలు చేసిన ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించిందని తెలిపారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ పథకాలను అమలు చేసిందన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేశామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.2 లక్షల లోపు అప్పు ఉన్న రైతులందరికీ ప్రభుత్వం కచ్చితంగా రుణమాఫీ చేసి చూపిస్తుందన్నారు. కానీ వ్యవసాయానికి సంబంధించి లోన్ తీసుకోని వారు కూడా రాజకీయంగా రోడ్డు మీదకు వచ్చి ప్రభుత్వాన్ని బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని దివాళ తీసినోళ్లు ఇవాళ కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. కళాశాలల ఫీజురీయంబర్స్‌మెంట్ 40 నెలలుగా రూ.5 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని, కానీ పాత బకాయిలపై యాజమాన్యలు ఏనాడు మాట్లాడకుండా ఇప్పుడు నిరసనలు తెలుపుతున్నారని దుయ్యబట్టారు. కళాశాలకు చెల్లించాల్సిన వాయిదాల పద్ధతితో బకాయిలను చెల్లిస్తామన్నారు. కళాశాలను మూసివేసే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగనణ చేపడుతుందని, దీనిని అందరు సహకరించాలన్నారు. రాబోయే రోజుల్లో ఎన్నికల్లో బీసీలకు మంచి అవకాలను కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అంతకు ముందు కలెక్టరేట్ వద్ద నుంచి క్రిష్ణవేణి చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు.

జోగుళాంబ మాత ఆశీస్సులతో అభివృద్ధి

అలంపూర్: జోగుళాంబ అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామిని ఆయన కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బీఎం సంతోష్, ఎస్పీ తోట శ్రీనివాస్రావు స్వాగతం పలికారు. అర్చక స్వాములు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన జోగుళాంబ అమ్మవారి క్షేత్రాన్ని కుటుంబ సమేతంగా దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. జోగుళాంబ అమ్మవారి మహిమతో రాష్ట్రంలోని ప్రజాపాలన ప్రభుత్వానికి శక్తిని ప్రసాదించాలని కోరుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచే వారు బలహీనపడి ప్రజా సమస్యను పరిష్కరించి ప్రజలకు సేవ చేసే అనుకూల పరిస్థితులు కల్పించి బలాన్ని ఇవ్వాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఆలయంలో హారతి సమయాలకు అనువుగా భక్తులు వెళ్లడానికి వీలుగా బస్సు సౌకర్యం ఉండే విధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ సిరాజుద్దీన్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డెప్ప, మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, ఆర్డీఓ రామచందర్, బీసీ సంక్షేమ శాఖ అధికారి రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి పనులు త్వరగా పూర్తిచేయాలి



ఫ్లైఓవర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్: ఎన్‌హెచ్–167కే నిర్మాణ పనుల్లో వేగం పెంచి, త్వరగా పూర్తిచేయాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కొల్లాపూర్ సమీపంలో చేపట్టిన జాతీయ రహదారి బైపాస్ నిర్మాణంతో పాటు బొంగరాలమిట్ట ప్రాంతంలో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులను శుక్రవారం పరిశీలించారు. బైపాస్ పనుల పురోగతిని తెలుసుకున్నారు. కొల్లాపూర్ నుంచి చౌటబెట్లకు వెళ్లే రోడ్డులో అండర్ పాస్ నిర్మాణానికి బదులుగా చౌరస్తా లేదా ఫ్లైఓవర్ నిర్మించాలని చౌటబెట్ల, తాళ్లనర్సింగాపురం గ్రామాల నాయకులు మంత్రిని కోరారు. ఈ విషయంపై మంత్రి నేషనల్ హైవే అధికారులకు ఫోన్ చేసి.. అక్కడ చేపట్టబోయే పనుల వివరాలను తెలుసుకున్నారు. బస్సుల రాకపోకలు, ప్రజా రవాణాకు ఇబ్బందులు లేకుండా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. వీలైనంత త్వరగా పనులను పూర్తిచేయాలన్నారు. మంత్రి వెంట నాయకులు కమలాకర్‌రావు, వంగా రాజశేఖర్‌గౌడ్, కురుమయ్యయాదవ్, ప్రసాద్, పురుషోత్తం నాయుడు, రాముడు ఉన్నారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలు



క్రీడాకారులతో ఎండీసీఏ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి రోడ్డు సమీపంలోని మైదానంలో శుక్రవారం ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ ఎంపికలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 80 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. ఆరు జట్లను ఎంపిక చేశామని తెలిపారు. ఈ ఆరు జట్లతో ఈనెల 21 నుంచి వారం రోజులపాటు అండర్–23 ఉమ్మడి జిల్లా క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. టోర్నీలో ప్రతిభ కనబరిచిన వారితో తుది జట్టును ఎంపిక చేస్తామని తెలిపారు. టోర్నీలో క్రీడాకారులు మెరుగైన ప్రదర్శన కనబరచాలని కోరారు. కార్యక్రమంలో ఎండీసీఏ ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, వెంకటరామారావు తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌ఐ కాల్వకు గండి



గుండాల సమీపంలో తెగిన కాల్వ

వెల్దండ: మండలంలోని గుండాల సమీపంలో రంగనాయకుల వాగు వద్ద శుక్రవారం కేఎల్‌ఐ కాల్వకు గండిపడి నీరంతా వృథాగా పారింది. కాల్వలో నీటి ఉధృతి అధికంగా ఉండటం, అక్విడేట్ వద్ద కట్ట గట్టిగా లేకపోవడంతో తెగినట్లు రైతులు, అధికారులు తెలిపారు. రెండేళ్ల కిందట రెండుసార్లు ఇదేచోట గండిపడగా మరమ్మతు చేపట్టారు. గ్రామ సమీపంలో ఓ రైతు కాల్వ దాటేందుకు సిమెంట్ పైపులు వేశారని.. అడ్డుగా ఉండటంతో అక్విడేట్ వద్ద కాల్వకు గండి పడినట్లు రైతులు, గ్రామస్తులు తెలిపారు. అధికారులు పర్యవేక్షణ చేపట్టి గండి పడకుండా చూడాలని కోరుతున్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి కాల్వకు నీటి సరఫరా నిలిపివేస్తేనే మరమ్మతులు చేపట్టేందుకు అవకాశం ఉందని డీఈఈ సమ్మయ్య తెలిపారు. త్వరలోనే ఆదేశాలు వస్తాయని.. కాల్వకు మరమ్మతులు చేపడతామని వివరించారు.

సమస్యలు అధిగమించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న ఆర్‌బీఐ రీజినల్ డైరెక్టర్ కమల్ ప్రసాద్ పట్నాయక్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఎంచుకున్న రంగంలో సమస్యలు అధిగమించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ డైరెక్టర్ కమల్ ప్రసాద్‌పట్నాయక్ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, మంజూరైన యూనిట్లకు సంబంధించిన చిన్న, మధ్య తరహా పారిశ్రామికవేత్తలతో రుణాల మంజూరు, విడుదలలో ఎదురవుతున్న సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, ముద్ర, ఎంఎస్‌ఎంఈ పథకాల కింద నాబార్డు, పీఎంఈజీపీల ద్వారా మంజూరైన యూనిట్లను గ్రౌండింగ్ చేసి పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా బ్యాంకర్లు సహకారం అందించాలన్నారు. వ్యవసాయ అనుబంధ, కులవృత్తులను ప్రోత్సహించేందుకు బ్యాంకర్లు కృషిచేయాలన్నారు. రూ.10 లక్షల వరకు మంజూరైన యూనిట్లకు ఎలాంటి సెక్యూరిటీ లేకుండా రుణాలు విడుదల చేయాలని, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలు అనుసరించి బ్యాంకర్లు మసలుకోవాలని సూచించారు. రుణాల విడుదలలో ఎలాంటి జాప్యం చేయరాదని చెప్పారు. బ్యాంకులు, సంబంధిత శాఖల్లో రుణాల మంజూరు, విడుదలలో ఎదురవుతున్న సమస్యలను పలువురు ఆర్‌బీఐ రీజినల్ డైరెక్టర్ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆయన లీడ్ బ్యాంక్ మేనేజర్ దృష్టికి గానీ, మెయిల్ ద్వారా ఆర్‌బీఐకి గానీ సమస్యను తెలిపితే పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. త్వరలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. అంతకు ముందు ఆయా పథకాల కింద ఇటీవల మంజూరైన 200 యూనిట్లకు సంబంధించిన రుణాల పంపిణీలో ఎలాంటి జాప్యం చేయరాదని సూచించారు. అందులో 50 యూనిట్లకు రుణాలు విడుదల చేస్తూ లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. సమావేశంలో ఆర్‌బీఐ రీజినల్ మేనేజర్ అనిల్‌కుమార్, యూబీఐ డీజీఎం సత్యనారాయణ, ఏపీజీవీబీ డీజీఎం శ్రీనివాస్, ఎఫ్ఐడీడీ డీజీఎం జగదీశ్‌కుమార్, డీఐసీ జనరల్ మేనేజర్ శ్రీలక్ష్మి, నాబార్డు డీడీఎం షణ్ముఖచారి, వివిధ బ్యాంకుల మేనేజర్లు, ఎఫ్‌పీఓలు, ఎన్‌జీఓలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

అవమానం భరించలేక యువకుడి ఆత్మహత్యాయత్నం

లింగాల: శిరోముండనం చేయించడాన్ని అవమానంగా భావించిన ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించిన ఘటన లింగాల మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఈ నెల 14న లింగాలకు చెందిన ముగ్గురు యువకులు ఓ పెట్రోల్‌బంక్ నిర్వాహకులపై దాడికి పాల్పడ్డారు. పెట్రోల్‌బంక్ నిర్వాహకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ముగ్గురు యువకులపై ఫిర్యాదు చేశారు. ఈ గొడవకు సంబంధించి ఇరువర్గాలు చర్చించుకొని రాజీ అయ్యారు. అయితే ఆ యువకుల ప్రవర్తన మంచిగా లేకపోవడంతో గుండు గీయించాలని పోలీసులు వారి కుటుంబ సభ్యులకు సూచించడంతో అదే రోజు శిరోముండనం చేయించినట్లు తెలిసింది. అందులో నితీస్‌కుమార్‌అనే యువకుడు అవమానంగా భావించి, ఇంట్లోనే ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించి ఏఎస్‌ఐ శ్రీనివాసులును వివరణ కోరగా.. ఈ నెల 14న పెట్రోల్ బంక్‌లో గొడవ జరిగిన మాట వాస్తవమేనని.. ఇరువర్గాలు చర్చించుకొని రాజీ అయ్యారని తెలిపారు. యువకుల ప్రవర్తనలో మార్పు రావాలనే ఉద్దేశంతోనే శిరోముండనం చేయించాలని కుటుంబ సభ్యులకు సూచించినట్లు పేర్కొన్నారు. నితీస్‌కుమార్ ఆత్మహత్యాయత్నం గురించి తమకు తెలియదని ఏఎస్‌ఐ తెలిపారు.

పీయూలో బ్యాడ్మింటన్ ఎంపికలు



ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: చెన్నై ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పోటీలకు పాలమూరు యూనివర్సిటీ జట్టును శుక్రవారం ఎంపిక చేశారు. బ్యాడ్మింటన్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన శ్రీరాములు (హాసిని కళాశాల), జగదీష్ (ఎస్‌సీఎస్‌ఎం కళాశాల), బడేసాబ్ (పీయూ), శివకృష్ణ (విశ్వవికాస్ కళాశాల), రాకేష్ (పీయూ)లను ఎంపిక చేసినట్లు పీడీ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో పీడీలు సత్యభాస్కర్, వెంకట్‌రెడ్డి, శారద, నరేష్ పాల్గొన్నారు.

నల్లకుంటలోని ప్రహరీని కూల్చండి

ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు

జడ్చర్ల: బాదేపల్లి పట్టణ నడిబొడ్డున ఉన్న నల్లకుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా నిర్మించిన ప్రహరీని వెంటనే కూల్చివేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని తహసీల్దార్ బ్రహ్మంగౌడ్ శుక్రవారం తెలిపారు. సర్వేనంబర్ 75లో దాదాపు 5.09 ఎకరాల విస్తీర్ణంలో మున్సిపల్, నీటి పారుదలశాఖ అనుమతి లేకుండా ప్రహరీ నిర్మించడంతో హైకోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. నల్లకుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిబంధనలకు విరుద్ధంగా ప్రహరీ నిర్మాణం చేపట్టారు. సంబంధిత అధికారులు నోటీసులు జారీ చేయగా వాటిని సవాల్ చేస్తూ పట్టాదారులు కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు వారంలోగా ప్రహరీ కూల్చి ఫొటోలను సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. లేకుంటే పుర అధికారులు తొలగించాలని ఉత్తర్వుల్లో పేర్కొనట్లు తహసీల్దార్ తెలిపారు.

అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌కు అనుమతి

- యువత సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ విజయేందిర బోయి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): నిరుద్యోగ యువతకు వివిధ వృత్తుల్లో నైపుణ్యాలను పెంపొందించి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఏర్పాటుచేసిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో ఈ సంవత్సరం నుంచే అడ్మిషన్లు తీసుకునేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని కలెక్టర్ విజయేందిర తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. మహబూబ్‌నగర్ బాలికల (ఐటీఐ), అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కేంద్రానికి అనుమతి వచ్చిందన్నారు. వచ్చే నెల 25వ తేదీ నుంచి కోర్సులు ప్రారంభవుతాయని చెప్పారు. ఈ నెల 30వ తేదీలోగా వాక్–ఇన్ అడ్మిషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అందుకుగాను http://iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో సదరు విద్యార్థి మొబైల్ నంబర్‌తో రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు ప్రింటెడ్ కాపీతో పాటు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో మహబూబ్‌నగర్ బాలికల ఐటీఐ కేంద్రంలో జరిగే వాక్–ఇన్ అడ్మిషన్‌కు హాజరు కావాలని తెలిపారు. మొత్తం 172 సీట్లకు గాను 6 కోర్సులు ఉంటాయన్నారు. మూడు కోర్సులు ఒక సంవత్సరానికి సంబంధించి ఉంటాయని.. మరో మూడు కోర్సులు రెండేళ్ల పాటు కొనసాగుతాయని చెప్పారు. ఆయా కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లలో చేరి, శిక్షణ తీసుకున్న తర్వాత వందశాతం జాబ్ గ్యారంటీ ఉంటుందన్నారు. జిల్లాలో అనుమతించిన అన్ని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో నూటికి నూరు శాతం సీట్లు భర్తీ కావాలని అధికారులను ఆదేశించారు.

జింకను కాపాడిన గ్రామస్తులు



నర్వ: మండలంలోని జక్కన్నపల్లి శివారులో జింక పిల్లను కుక్కలు తరుముతుండగా జక్కన్నపల్లి గ్రామస్తులు వెంబండించి జింకను కాపాడారు. ఈ మేరకు.. జింక పిల్లను కుక్క భారి నుంచి కాపాడి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి ఎస్‌ఐ కురుమయ్యకు అప్పగించారు. అనంతరం ఫారెస్టు అధికారులకు ఎస్‌ఐ సమాచారం అందించి జింక పిల్లను వారికి అప్పగించగా వారు జింక పిల్లను తిరిగి అడవిలోకి వదిలివేశారని ఎస్‌ఐ కురుమయ్య తెలిపారు. జింకను కాపాడిన గ్రామస్తులను ఆయన అభినందించారు. జక్కన్నపల్లి గ్రామస్తులు రామన్‌గౌడ్, నర్సింహ తదితరులు ఉన్నారు.

జూరాలకు పెరిగిన వరద

- 11 క్రస్టు గేట్ల ఎత్తివేత
- ప్రాజెక్టు నుంచి 85,356 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల



జూరాల వద్ద 11 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద

ధరూరు/ఆత్మకూర్: ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు మళ్లీ వరద వస్తోంది. వారం రోజులుగా స్వల్పంగా వస్తున్న ఇన్‌ఫ్లో.. శుక్రవారం మరింత పెరిగింది. 75వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైనట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 11 క్రస్టు గేట్లను ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం ప్రాజెక్టు నుంచి 37,875 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. గేట్ల ద్వారా 45,672 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 48, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 731, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులతో కలిపి మొత్తం 85,356 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు వైపు విడుదల చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఆల్మట్టి ప్రాజెక్టుకు 48,057 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 43,173 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 51,720 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 51,051 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

543 ఎం.యూ. విద్యుదుత్పత్తి..

దిగువ, ఎగువ జూరాల జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి నిరంతరాయంగా కొనసాగుతోంది. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 196 మెగావాట్లు, 281.729 ఎం.యూ., దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 261.501 ఎం.యూ. ఉత్పత్తిని చేపట్టినట్లు ఎస్ఈ సూరిబాబు తెలిపారు. ఇప్పటి వరకు 543.230 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామన్నారు.

సుంకేసులలో 10 గేట్లు ఎత్తివేత..

రాజోళి: సుంకేసుల డ్యాంలో 10 గేట్లను తెరిచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు జేఈ మహేంద్ర తెలిపారు. శుక్రవారం ఎగువ నుంచి 43,560 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 42,420 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. 2,095 క్యూసెక్కుల నీటిని కేసీ కెనాల్‌కు విడుదల చేసినట్లు తెలిపారు.